


అనుక్షణం ప్రజల పక్షం RNI NO: TELTEL/2023/87607

# జర్నలిస్ట్ వార్త

తెలుగు దిన పత్రిక..




సంపుటి - 2 సంచిక -350 శుక్రవారం 1 మే 2026 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజీలు -5 వెల - 5/-

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Districts

# కార్మికవర్గ స్ఫూర్తితో ముందుకెళ్తున్నాం

**జవాబుదారీతనం పెంచేందుకే సెంట్రలైజ్డ్ ప్రొక్యూర్‌మెంట్ విధానం**

**విద్యార్థులకు సకాలంలో పాఠ్య సామగ్రి అందాలి**

**ప్రతి విద్యార్థి నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకోవాలి : సంక్షేమ శాఖలపై సమీక్షలో ముఖ్యమంత్రి**

**కార్మికవర్గ స్ఫూర్తితో ముందుకెళ్తున్నాం**

**-మేడే శుభాకాంక్షలు తెలిపిన సీఎం రేవంత్‌రెడ్డి**



**హైదరాబాద్: ఏప్రిల్ 30(జర్నలిస్ట్ వార్త);**
విద్యార్థులకు పాఠ్య సామగ్రి సరఫరా విషయంలో సెంట్రలైజ్డ్ ప్రొక్యూర్‌మెంట్ విధానం ద్వారా జవాబుదారీతనం పెరుగుతుందని ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి అన్నారు. **మిగతా 2లో...**



# హర్మూజ్‌కి కొత్త దశ

**అమెరికా వ్యూహాలు బెడిసికొట్టాయి: ఖమేనీ**

**పుతిన్ తో ఫోన్లో మాట్లాడిన ట్రంప్**

**మళ్లీ దాడి చేయొద్దని రష్యా హెచ్చరిక**

**సడలని యుద్ధ భయాలు గల్ఫ్ షేర్లు పతనం**



**న్యూఢిల్లీ ఏప్రిల్ 30(జర్నలిస్ట్ వార్త);**
పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తీవ్రమవుతున్నాయి. కాల్పుల విరమణ ఒప్పందం అమల్లో ఉన్నప్పటికీ ఇరు దేశాల మధ్య మాటల యుద్ధం నడుస్తుంది. అమెరికా అద్యక్షుడు ట్రంప్ ఇరాన్ లొంగిపోవాలని**మిగతా 2లో...**

## అక్రిడేషన్ కార్డులను అందచేసిన పొంగులేటి

**అర్హులందరికీ అందచేస్తామని ప్రకటన**



# కెరీర్ బిల్డింగ్ లక్ష్యం


**యూనివర్సిటీల్లో కోర్సుల రీస్ట్రక్చరింగ్**

**విద్యాశాఖ సమీక్షలో సిఎం చంద్రబాబు ఆదేశం**

**ప్రాథమిక స్థాయి నుండి పిజి వరకు పాఠ్యాంశాల మార్పు**

**పరిశోధన, ఆవిష్కరణల కేంద్రాలుగా విశ్వవిద్యాలయాలు**

**అమరావతి ఏప్రిల్ 30(జర్నలిస్ట్ వార్త);**
రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలు అందిస్తోన్న వివిధ కోర్సులను రీస్ట్రక్చరింగ్ చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. సచివాలయంలో గురువారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుత, భవిష్యత్ అవసరాలను అందిపుచ్చుకునేలా ప్రాథమిక స్థాయి నుంచి పిజి వరకూ వివిధ పాఠ్యాంశాలను మార్పు చేయాలన్నారు. కెరీర్ బిల్డింగ్, కేరక్టర్ బిల్డింగ్ జరిగేలా విద్యా వ్యవస్థ ఉండాలన్నారు. ఆరోగ్యం, టెక్నాలజీతో పాటు బెస్ట్ ప్రాక్టీసెస్‌ను నేర్పించేలా ఈ పాఠ్యాంశాలు ఉండాలని సూచించారు. రీసెర్చ్, ఇన్నోవేషన్, స్టార్టప్‌లను ప్రోత్సహించేలా విద్యా వ్యవస్థ మార్పులను**మిగతా 2లో...**



## బీసీ సంక్షేమ శాఖ అభివృద్ధి సలహాదారుగా వీహెచ్ నియామకం



# కాలానికి అనుగుణంగా చట్టాలు

**లైంగికదాడికి గురైన బాలిక గర్భవిచ్ఛిత్తిపై సుప్రీం కీలకవ్యాఖ్యలు**

**ఆ ఘటన వారిని జీవితాంతం వెంటాడుతుంది : సీజేఐ**

**బాధిత బాలిక, ఆమె తల్లిదండ్రులదే తుది నిర్ణయమని స్పష్టం**

**లైంగికదాడికి గురైన బాలిక గర్భవిచ్ఛిత్తిపై సుప్రీం కీలకవ్యాఖ్యలు**

**న్యూఢిల్లీ : ఏప్రిల్ 30(జర్నలిస్ట్ వార్త);**
లైంగికదాడి కారణంగా గర్భం దాల్చిన బాలికకు గర్భవిచ్ఛిత్తిపై ఎలాంటి పరిమితులు లేకుండా చట్ట సవరణ చేయాలని కేంద్ర ప్రభుత్వానికి సర్వోన్నత్య న్యాయస్థానం సూచించింది. చట్ట పరమైన వ్యవస్థ కాలంతో పాటు మార్పు చెందాలనీ, బాధితుల గౌరవానికి ప్రాధాన్యత ఇవ్వాలని ధర్మాసనం స్పష్టం చేసింది. గర్భవతి అయిన బాధిత బాలిక విషయంలో ఎయిమ్స్ దాఖలు చేసిన క్యూరే టీవ్ పిటిషన్‌పై గురువారం**మిగతా 2లో...**








# ఇంధన సరఫరాకు ఎలాంటి కొరత లేదు

**కొరత భయాలతో పెట్రోల్ బంకులకు ప్రజలు క్యూ కట్టవద్దని కిషన్ రెడ్డివిజ్ఞప్తి**

**నిన్న పెట్రోల్ వినియోగం రోజువారి సగటుతో రెండింతలు, డీజిల్ రెండున్నర రెట్లు పెరిగినట్లు వెల్లడి**

**హైదరాబాద్: ఏప్రిల్ 30(జర్నలిస్ట్ వార్త);**
తెలంగాణ రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్ సరఫరాకు ఎలాంటి కొరత లేదని, ప్రజలు ఆందోళన చెందవద్దని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో ఇంధన కొరత భయాలతో హైదరాబాద్ నగరం **మిగతా 2లో...**

# బాలికలదే పైచేయి

**ఏపీ టెన్త్ ఫలితాల విడుదల..**

**మొత్తం 85.25 శాతం ఉత్తీర్ణత నమోదు**

**బాలికల ఉత్తీర్ణత శాతం 87.90%.. బాలుర ఉత్తీర్ణత 82.68%**

**గత ఏడాదితో పోలిస్తే 4 శాతానికి పైగా పెరిగిన ఉత్తీర్ణత**

**ప్రభుత్వ పాఠశాలల్లోనూ మెరుగైన ఫలితాలు**




**అమరావతి ఏప్రిల్ 30(జర్నలిస్ట్ వార్త);**
ఏపీలో పదో తరగతి విద్యార్థుల నిరీక్షణకు తెరపడింది. రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఉదయం 11 గంటలకు టెన్త్ పబ్లిక్ పరీక్షల ఫలితాలను విడుదల చేశారు. ఈ ఏడాది మొత్తం 85.25 శాతం ఉత్తీర్ణత నమోదైనట్లు ఆయన ప్రకటించారు. గత ఏడాదితో పోల్చి చూస్తే ఉత్తీర్ణత శాతం 4 శాతానికి పైగా పెరగడం గమనార్హం.

**బాలికల హవా.. మెరుగైన ప్రభుత్వ పాఠశాలలు**
ఎప్పటిలాగే ఈసారి కూడా పదో తరగతి ఫలితాల్లో బాలికలు తమ సత్తా చాటారు. బాలికల ఉత్తీర్ణత శాతం 87.90% కాగా, బాలుర ఉత్తీర్ణత 82.68% వద్ద నిలిచింది. దీంతో బాలురపై బాలికలు స్పష్టమైన ఆధిక్యం కనబరిచారు. అదే సమయంలో ప్రభుత్వ పాఠశాలల పనితీరు కూడా మెరుగుపడింది.**మిగతా 2లో...**

# బాలికలదే పైచేయి

**మొదటిపేజీ తరువాయి**

ప్రభుత్వ పాఠశాలల్లో ఈసారి 78.39 % ఉత్తీర్ణత నమోదైంది. గతేడాది(72.8%)తో పోలిస్తే ప్రభుత్వ బడుల్లో ఉత్తీర్ణత శాతం పెరగడం రాష్ట్ర విద్యావ్యవస్థకు సానుకూల సంకేతంగా భావిస్తున్నారు.
ఫలితాల విడుదల అనంతరం మంత్రి లోకేశ్ విద్యార్థులు, ఉపాధ్యాయులు, పేరెంట్స్‌కు అభినందనలు తెలియజేస్తూ ప్రత్యేకంగా ట్వీట్ చేశారు. "ఈ ఫలితాలు మన విద్యార్థుల పట్టుదలను, ఉపాధ్యాయులు, కుటుంబాల బలమైన మద్దతును ప్రతిబింబిస్తాయి. విజయం సాధించిన వారందరికీ నా హృదయపూర్వక అభినందనలు. ఈసారి ఉత్తీర్ణత సాధించని వారు దయచేసి నిరాశ చెందవద్దు. ఫ్యామిలీ, ఉపాధ్యాయులు, సమాజం మద్దతుతో మీరు మరింత బలంగా తిరిగి వస్తారు. మన విద్యార్థులే ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తుకు వెన్నెముక, ప్రతి బిడ్డ విజయం సాధించేలా చూడటానికి మేము కట్టుబడి ఉన్నాము" అని లోకేశ్ తన ట్వీట్‌లో పేర్కొన్నారు. కాగా, ఏపీలో మార్చి 16 నుంచి ఏప్రిల్ 1 వరకు పదో తరగతి పరీక్షలు జరిగాయి. రాష్ట్రవ్యాప్తంగా 3415 పరీక్షా కేంద్రాల్లో నిర్వహించిన ఈ పరీక్షలకు సుమారు 6.40 లక్షల మంది విద్యార్థులు హాజరయ్యారు. వీరిలో 6,22,074 మంది రెగ్యులర్ విద్యార్థులు కాగా, 18,842 మంది ప్రైవేట్‌గా పరీక్షలు రాశారు. ఫలితాల విడుదలతో విద్యార్థులు, వారి తల్లిదండ్రుల ఉత్కంఠకు తెరపడినట్లయింది.

# గూడూరులో 45.8 డిగ్రీల ఉష్ణోగ్రత..

ఆంధ్రప్రదేశ్‌లో ఎండలు మండిపోతున్నాయి. నెల్లూరు జిల్లా గూడూరులో రికార్డ్ స్థాయిలో ఉష్ణోగ్రత నమోదైంది. గురువారం అక్కడ ఏకంగా 45.8 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదు కావడం ఆందోళన కలిగిస్తోంది. ఈ సీజన్‌లో రాష్ట్రంలో ఇదే అత్యధిక ఉష్ణోగ్రత కావడం గమనార్హం.
రాష్ట్రవ్యాప్తంగా 216 మండలాల్లో 41 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదైనట్లు ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ (ఏపీఎస్డీఎంఏ) వెల్లడించింది. రానున్న రెండు రోజుల పాటు రాష్ట్రంలో భానుడి భగభగలు కొనసాగుతాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ హెచ్చరించారు. రేపు పార్వతీపురం మన్యం, పోలవరం జిల్లాల్లోని 9 మండలాల్లో తీవ్ర వడగాల్పులు వీచే అవకాశం ఉందని ఆయన తెలిపారు.మరోవైపు, ద్రోణి ప్రభావంతో కొన్ని జిల్లాల్లో అకాల వర్షాలు కురిసే అవకాశం ఉందని ప్రఖర్ జైన్ వివరించారు. రేపు శ్రీకాకుళం, విజయనగరం, మన్యం, అల్లూరి, పోలవరం, నెల్లూరు, అనంతపురం, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు పడొచ్చని తెలిపారు. ఈ నేపథ్యంలో రైతులు, వ్యవసాయ కూలీలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా వర్షం పడే సమయంలో చెట్ల కింద ఆశ్రయం పొందవద్దని ఆయన స్పష్టం చేశారు. ఒకవైపు తీవ్రమైన ఎండలు, మరోవైపు పిడుగులతో కూడిన వర్షాల హెచ్చరికలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు కోరుతున్నారు.

# హర్మూజ్‌కి కొత్త దశ

**మొదటిపేజీ తరువాయి**

ఇరాన్ ఓడరేవులపై అమెరికా నావికా దిగ్బంధనం గల్ఫ్‌లో అంతరాయాలను మరింత తీవ్రతరం చేస్తుందని, దాని లక్ష్యాలను సాధించడంలో విఫలమవుతుందని ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియన్ అన్నారు. సముద్ర దిగ్బంధనం లేదా ఆంక్షలను విధించే ఏ ప్రయత్నమైనా అంతర్జాతీయ చట్టానికి విరుద్ధమని, విఫలమవుతుందని పెజెష్కియన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటువంటి చర్యలు ప్రాంతీయ భద్రతను పెంపొందించడంలో విఫలమవడమే కాకుండా, పర్షియన్ గల్ఫ్‌లో ఉద్రిక్తతకు, శాశ్వత స్థిరత్వానికి అంతరాయానికి మూలమని ఆయన అన్నారు.

**ఇరాన్ పై దాడులు చేయొద్దు : పుతిన్**

రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, ఇరాన్‌పై దాడులను అమెరికా తిరిగి ప్రారంభించొద్దని ట్రంప్ నకు తెలిపారు. ఇరు దేశాల నేతలు గురువారం ఫోన్ లో మాట్లాడుకున్నారని, ఈ సందర్భంగా కాల్పుల విరమణను పొడిగించాలనే ట్రంప్ నిర్ణయం "సరైనది" అని పుతిన్ అన్నారని క్రెమ్లిన్ సహాయకుడు యూరి ఉషాకోవ్ విలేకరులకు తెలిపారు. అయితే, ఇరాన్ పై సైనిక చర్య తిరిగి ప్రారంభమైతే ఆ ప్రాంతానికి, ప్రపంచానికి చాలా నష్టం జరుగుతుందని పుతిన్ స్పష్టం చేశారని, అయితే ట్రంప్ ఉక్రెయిన్ పై యుద్ధాన్ని ముగించాలని పుతిన్ కు చెప్పారని ఉషాకోవ్ తెలిపారు.

# తెలుగు రాష్ట్రాలకు చల్లటి కబురు

### తమిళనాడు మీదుగా మన్నార్ గల్ఫ్ వరకు ద్రోణి

### తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం

**హైదరాబాద్ /అమరావతి : ఏప్రిల్ 30(జర్నలిస్ట్ వార్త);**తెలుగు రాష్ట్రాల్లో ఎండలు దంచికొడుతున్న నేపథ్యంలో వాతావరణ శాఖ ఉపశమనం కలిగించే వార్త చెప్పింది. ద్రోణి ప్రభావంతో అటు ఆంధ్రప్రదేశ్, ఇటు తెలంగాణలోని పలు ప్రాంతాల్లో వచ్చే మూడు రోజులు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఈదురు గాలులు సహా పిడుగులతో కూడిన జల్లులు కురుస్తాయని.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరించారు. అమరావతి వాతావరణ కేంద్రం ప్రకారం.. దక్షిణ అంతర్గత కర్ణాటక నుంచి తమిళనాడు మీదుగా మన్నార్ గల్ఫ్ వరకు సగటు సముద్ర మట్టానికి 0.9 కి.మీ. ఎత్తులో ద్రోణి విస్తరించి ఉంది. ఫలితంగా.. ఏపీలోని దక్షిణ కోస్తా, రాయలసీమ ప్రాంతాల్లో మూడు రోజుల పాటు అక్కడక్కడా వర్షాలు కురిసే అవకాశముంది. గురువారం తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు లేదా పిడుగులతో కూడిన జల్లులు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే ఛాన్స్ ఉంది. ఈ నేపథ్యంలో గంటకు 50– 60 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశముంది. శుక్ర, శనివారాల్లో పలు చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురవడం సహా గంటకు సుమారు 40 – 50 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే ఛాన్స్ ఉంది. ఈ నేపథ్యంలో వేడి, తేమ సహా అసౌకర్యమైన వాతావరణ పరిస్థితులు ఏర్పడనున్నట్టు సమాచారం. హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకారం.. ద్రోణి/వాయు అస్థిరత ఇప్పుడు దక్షిణ అంతర్గత కర్ణాటక నుంచి తమిళనాడు మీదుగా మన్నార్ గల్ఫ్ వరకు సగటు సముద్ర మట్టానికి 0.9 కి.మీ. ఎత్తులో విస్తరించి ఉంది.

# మా వాటానిధులు వెంటనే విడుదల చేయండి..

**మొదటిపేజీ తరువాయి**

ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఏపీ తెలుగు, సంస్కృత అకాడమీ ఛైర్మన్ ఆర్‌డీ విల్సన్ డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసినప్పటికీ తెలంగాణ ప్రభుత్వం వాటిని బేఖాతరు చేస్తోందని ఆయన ఆరోపించారు.నిధుల కొరత కారణంగా ఏపీ తెలుగు, సంస్కృత అకాడమీ కార్యకలాపాలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయని విల్సన్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై ఇప్పటికే రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్‌కు, సమగ్ర శిక్షా అధికారులకు లేఖలు రాసినట్లు గుర్తుచేశారు. మరోవైపు ఏపీ ఇంటర్మీడియట్ పాఠ్యపుస్తకాల ముద్రణకు సంబంధించి రావాల్సిన రూ.50 కోట్ల బకాయిలను కూడా ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఆయన కోరారు.
రాష్ట్ర విభజన తర్వాత తెలుగు అకాడమీ ఆస్తులు, డిపాజిట్లను ఆంధ్రప్రదేశ్, తెలంగాణ మధ్య 58:42 నిష్పత్తిలో పంపిణీ చేయాలని గతంలోనే ఒప్పందం కుదిరింది. దీనిపై సుప్రీంకోర్టు సైతం జోక్యం చేసుకుని, ఏపీ వాటాను 6 శాతం వడ్డీతో సహా చెల్లించాలని 2021 హైకోర్టు తీర్పును సమర్థిస్తూ ఆదేశాలు జారీ చేసింది. అయినప్పటికీ తెలంగాణ నుంచి స్పందన లేదని ఏపీ అకాడమీ వర్గాలు చెబుతున్నాయి.ఈ సందర్భంగా విల్సన్ ఏపీ ప్రభుత్వానికి పలు విజ్ఞప్తులు చేశారు. తమిళనాడు తరహాలో ఏపీలో వర్చువల్ అకాడమీ ఏర్పాటుకు కృషి చేస్తున్నామని, అకాడమీ భవనం కోసం ప్రభుత్వం భూమి కేటాయిస్తే రూ.15 కోట్లతో నిర్మిస్తామని తెలిపారు. తెలుగు, సంస్కృత అకాడమీ ఛైర్మన్‌కు కేబినెట్ హోదా కల్పించాలని కోరారు. ప్రైవేట్ విద్యా సంస్థలు కూడా అకాడమీ పుస్తకాలను కొనుగోలు చేసేలా ప్రభుత్వం ఆదేశాలివ్వాలని, అకాడమీలో ఖాళీగా ఉన్న 13 పోస్టులను భర్తీ చేయాలని విజ్ఞప్తి చేశారు.

## ఇంధన సరఫరాకు ఎలాంటి కొరత లేదు

**మొదటిపేజీ తరువాయి**

సహా పలు ప్రాంతాల్లో పెట్రోల్ బంకుల వద్ద వాహనాలు బారులు తీరుతున్నాయి. ఇప్పటికే తెలంగాణ ప్రభుత్వం కొరత లేదని ప్రకటించింది. తాజాగా, కిషన్ రెడ్డి కూడా ఆందోళన అవసరం లేదని 'ఎక్స్' వేదికగా ట్వీట్ చేశారు.అంతేకాదు, తెలంగాణలో పెట్రోల్, డీజిల్ వినియోగం ఎలా పెరుగుతుందో గణాంకాలు పేర్కొన్నారు. పెట్రోల్ రోజువారి సాధారణ సగటు 6,920 కిలోలీటర్లుగా ఉండగా, నిన్న ఒక్కరోజే 12,875 కిలోలీటర్లు సరఫరా జరిగిందని తెలిపారు. డీజిల్ సాధారణ సగటు 9,017 కిలోలీటర్లు కాగా, నిన్న 21,295 కిలోలీటర్ల పంపిణీ జరిగినట్లు వెల్లడించారు.
డిమాండ్‌కు మించి సరఫరా జరుగుతోందని కిషన్ రెడ్డి వెల్లడించారు. అందుకే సామాజిక మాధ్యమాల్లో వచ్చే అసత్య ప్రచారాలను నమ్మవద్దని సూచించారు. పుకార్లు నమ్మి పెట్రోల్ బంకుల వద్దకు వచ్చి అనవసరంగా క్యూ కట్టవద్దని పేర్కొన్నారు. అవసరానికి మించి ఇంధనాన్ని నిల్వ చేసుకోవద్దని ప్రజలకు కిషన్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

# కెరీర్ బిల్డింగ్ లక్ష్యం

**మొదటిపేజీ తరువాయి**

అందిపుచ్చుకోవాలన్నారు. ఈ దిశలో పాఠశాల, ఇంటర్, ఉన్నత విద్య, నైపుణ్యాభివృద్ధిపై విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు వచ్చేలా వివిధ కోర్సులు రూపొందించాలని ఆదేశించారు. దీని కోసం ఐఐటీ చెన్నై సహా వివిధ ప్రతిష్టాత్మక సంస్థల నుంచి సిఫార్సులు తీసుకుని విద్యాశాఖలో అమలు చేయాలని పేర్కొన్నారు. విశ్వవిద్యాలయాలు పరిశోధనలు, ఆవిష్కరణలకు కేంద్రాలుగా మారాలని పేర్కొన్నారు. గేమ్ చేంజర్‌లుగా మారనున్న లాజిస్టిక్స్, గ్రీన్ ఎనర్జీ లాంటి రంగాల్లోనూ కొత్త కోర్సులు తీసుకురావాలని చెప్పారు. డిమాండ్‌కు అనుగుణంగా ఈ కోర్సులు రావాల్సిన అవసరముందన్నారు. క్వాంటం టెక్నాలజీపై రాష్ట్రంలో మొట్ట మొదటగా కోర్సును ప్రారంభించటంపై ఆంధ్రా యూనివర్సిటీని ఆయన అభినందించారు. రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలు అంతర్జాతీయంగా పోటీ పడాలని, దీనికి అనుగుణంగా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ప్రతీ యూనివర్సిటీకి ఏదో ఒక పారిశ్రామిక సంస్థతో అనుసంధానమై ఉండేలా చూడాలని సూచించారు. యూనివర్సిటీల్లో జర్మన్ సహా వివిధ విదేశీ భాషల్లో శిక్షణ కోసం ఓ విభాగం ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. యూనివర్సిటీ రికార్డులను కూడా ఆన్‌లైన్ చేయాలని సూచించారు. త్వరలో రాష్ట్రంలో వివిధ ప్రతిష్టాత్మక సంస్థలు లాజిస్టిక్స్, ఏవియేషన్, హార్టికల్చర్ యూనివర్సిటీలను ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చాయని సీఎం తెలిపారు.

**త్వరలో స్టూడెంట్స్ ఇన్నోవేషన్ కాంక్లేవ్**

విద్యార్థులకు కొత్త ఆలోచనలు వచ్చేలా వారితో ఓ ఏఐ కాన్ఫరెన్సు నిర్వహించాలని ముఖ్యమంత్రి చెప్పారు. దానికి స్టూడెంట్స్ ఇన్నోవేషన్ కాంక్లేవ్ గా పేరు పెట్టాలని సూచించారు. విద్యార్థులకు అన్ని పోషకాలూ అందేలా మధ్యాహ్న భోజన మెనూను రూపొందించాలని సూచించారు. మానసిక, భౌతిక ఎదుగుదలకు అనుగుణంగా ఆహారం అందేలా చూడాలని స్పష్టం చేశారు. హాస్టళ్లు, రెసిడెన్షియల్ పాఠశాలల్లో కిచెన్ గార్డెన్లను అభివృద్ధి చేయాలని పేర్కొన్నారు. లీప్ యాప్ ద్వారా తల్లితండ్రులు కూడా విద్యార్థుల హాజరు, వారి పురోగతిని ఎప్పటికప్పుడు తెలుసుకునేలా చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. ఏజెన్సీ ప్రాంతాల్లోనూ సాంకేతికతతో కూడిన ఉత్తమ విద్యను అందించాలని ఆదేశించారు. రాష్ట్రంలో ఆటిజం సహా దివ్యాంగ విద్యార్థులకు విద్యాబోధనలో ఎలాంటి ఆటంకాలు లేకుండా శ్రద్ధ తీసుకోవాలని చెప్పారు. క్రీడలతో పాటు మానసికోల్లాసానికి కో-కరిక్యులర్ యాక్టివిటీస్ ను పెంచాలని తెలిపారు. ఇంటర్ లో విద్యార్థులకు వివిధ కాంబినేషన్లలో కోర్సులు అందుబాటులో ఉండేలా చూడాలని, దీనిపై అధ్యాపకులకు కూడా రీఓరియంటేషన్ నిర్వహించాలని సూచించారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా కోర్సులను రీస్ట్రక్చర్ చేస్తున్నట్లు వెల్లడించారు. వన్ క్లాస్ వన్ టీచర్ పాఠశాలలను పెంచేలా చర్యలు చేపట్టామని తెలిపారు. ప్రస్తుతం పాఠశాలల్లో ఎన్ రోల్ మెంట్ ను కూడా పెంచుతున్నట్లు తెలిపారు. ప్రాథమిక స్థాయి నుంచి ఉన్నత విద్య వరకూ పాఠ్యాంశాలను మార్పు చేయటంతో పాటు బ్రిడ్జి కోర్సులు కూడా విద్యార్థులకు అందిస్తున్నామని తెలియచేశారు. ఈ సమీక్షలో విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్, ఇంటర్మీడియట్ కమిషనర్ పి రంజిత్ భాషా, పాఠశాల విద్య కమిషనర్ తమీర్ అన్సారియా, కళాశాల విద్య కమిషనర్ భరత్ గుప్తా, స్కిల్ డెవలప్మెంట్ ఎండి గణేష్, సమ్రగ శిక్ష డైరెక్టర్ బి శ్రీనివాస్, ఉన్నత విద్యామండలి ఛైర్మన్ మధుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# కార్మికవర్గ స్ఫూర్తితో ముందుకెళ్తున్నాం

**మొదటిపేజీ తరువాయి**



విద్యార్థులకు అవసరమైన సామగ్రిని సకాలంలో అందేలా చూడాలని ఆదేశించారు. దుస్తులు, నోటు పుస్తకాలు, ఇతర సామగ్రి సకాలంలో అందితే విద్యార్థులు చదువుపై పూర్తి స్థాయిలో శ్రద్ధ చూపుతారని తెలిపారు. విద్యాశాఖతో పాటు బీసీ, మైనారిటీ, గిరిజన సంక్షేమ శాఖలు, ఎస్సీ డెవలప్‌మెంట్ శాఖల పరిధిలోని విద్యా సంస్థల్లోగల విద్యార్థులకు అందజేసే సామగ్రి సెంట్రలైజ్డ్ ప్రొక్యూర్‌మెంట్‌పై ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి గురువారం సాయంత్రం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో దుస్తులు, నోటు పుస్తకాలు, ట్రంక్ పెట్టెలు, ఇతర సామగ్రి సరఫరాకు సంబంధించి ఏ శాఖకు ఆ శాఖ ప్రొక్యూర్‌మెంట్, సరఫరా చేపట్టడంతో అవకతవకలకు ఆస్కారం ఉండేదన్నారు. వాటిని అరికట్టేందుకు సెంట్రలైజ్డ్ ప్రొక్యూర్‌మెంట్ విధానాన్ని తీసుకువచ్చామని సీఎం తెలిపారు. అటువంటి అవకతవకలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని స్పష్టం చేశారు. విద్యార్థులకు ప్రయోజనం చేకూర్చేందుకు ప్రభుత్వం ప్రయత్నం చేస్తుందనీ, సరఫరాదారుల ప్రయోజనాలు కాపాడేందుకు కాదన్నారు. విద్యార్థులకు అందజేసే నోటు పుస్తకాలు, ట్రంక్ పెట్టెలు, ప్లేట్లు, గ్లాసులు, ట్రాక్ షూట్లు, బెడ్ షీట్లు, స్కూల్ బ్యాగులు, ఐడీ కార్డులు, యూనిఫాంలు అన్నీ నాణ్యమైనవే ఉండాలని అధికారులను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. నాణ్యతతో పాటు సకాలంలో అందడంపైనా ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. జూన్ 15 నాటికి విద్యార్థులకు అవసరమైన సామగ్రి అందాలనీ, ఆ వెంటనే సరఫరాదారులకు చెల్లింపులు పూర్తి చేస్తామని సీఎం తెలిపారు.
విద్యార్థులకు అందజేసే వస్తువులకు సంబంధించి మండల స్థాయిలో ఒక నోడల్ అధికారిని నియమించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. అక్కడి నుంచి క్షేత్ర స్థాయిలో గ్రామాల్లోని పాఠశాలలు, హాస్టళ్లకు వస్తువుల సరఫరా జరిగేలా చర్యలు చేపట్టాలనీ, సరఫరాకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు తీయించాలని అన్నారు. అదే విధంగా ప్రతి విద్యార్థికి అవసరమైన సామగ్రి అందిందా లేదా చెక్ చేసుకోవాలని ఆయన ఆదేశించారు. నోటు పుస్తకాలు, యూనిఫాం, ఇతర సామగ్రిని అందుకున్న తర్వాత వారి భావాలను తెలియజేసేందుకు విద్యార్థుల నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకోవాలని అధికారులకు సీఎం సూచించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, విద్యాశాఖల మధ్య సమన్వయానికి ఒక కమిటీని నియమించాలని ఆదేశించారు. సమీక్షలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి, ఎంపీ వేం నరేందర్ రెడ్డి, సీఎం ఓఎస్డీ వేముల శ్రీనివాసులు, గిరిజన సంక్షేమ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సబ్యసాచి ఘోష్, విద్యా శాఖ కార్యదర్శి యోగితా రాణా, మైనారిటీ సంక్షేమ శాఖ కార్యదర్శి షఫీఉల్లా, బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి బాల మాయాదేవి, సెర్ప్ సీఈవో దివ్య, ఉన్నత విద్యా శాఖ కమిషనర్ శ్రీదేవసేన, పాఠశాల విద్యా శాఖ డైరెక్టర్ డాక్టర్ నవీన్ నికోలస్, గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి సంతోష్, టీజీబీసీడబ్ల్యూఆర్ఐఈఎస్ కార్యదర్శి బి.సైదులు తదితరులు పాల్గొన్నారు.

# కాలానికి అనుగుణంగా చట్టాలు

**మొదటిపేజీ తరువాయి**

సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జయమాల్య బాగ్చీలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారణ జరిపింది. ఈ సందర్భంగా ఎయిమ్స్ తరపున అదనపు సొలిసిటర్ జనరల్ (ఏఎస్జీ) ఐశ్వర్యభాటి వాదనలు వినిపించారు. ప్రస్తుతం బాధిత బాలిక గర్భం కొనసాగించడం ఆమెతో పాటు పుట్టబోయే బిడ్డకు మంచిదని నివేదించారు. ఈ అభ్యర్థనపై అభ్యంతరాలను వ్యక్తం చేసిన ధర్మాసనం పలు కీలక వ్యాఖ్యలు చేసింది. ఆ బిడ్డపై నిర్ణయం రాష్ట్ర ప్రభుత్వానిది లేదా వైద్య సంస్థలది కాకుండాడ బాధిత బాలిక, ఆమె తల్లిదండ్రులదై ఉండాలని వ్యాఖ్యానించింది. 'దయచేసి మీ(కేంద్ర ప్రభుత్వాన్ని) చట్టాన్ని సవరించండీ. లైంగికదాడి కారణంగా గర్భం దాల్చినప్పుడు కాలపరిమితి ఉండకూడదు. మారుతున్న కాలానికి అనుగుణంగా చట్టం ఉండాలి' అని పేర్కొంది.

ఆ ఘటన బాధితురాలికి మాయని మచ్చ:సీజేఐ

ఎయిమ్స్‌తో పాటు రాష్ట్ర ప్రభుత్వ వాదనలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం పలు అంశాలను ప్రస్తావించింది. 'ఇది బాలికపై లైంగికదాడి కేసు. ఇది బాధితురాలికి జీవితాంతం మచ్చ. మానసిక క్షోభ మిగులుస్తుంది. బాధితురాలు తల్లి కావాలి. కానీ ఆ బాధను అనుభవించిన తల్లిని కాకుండా బిడ్డ(కడుపులోని పిండం)పైనే ఎక్కువ దృష్టి పెడుతున్నారు' అని సీజేఐ వ్యాఖ్యానించారు. దీంతో ఆ బాలిక ఆరోగ్యంపై శాశ్వత ప్రభావం లేకపోతే గర్భవిచ్ఛిత్తిని నిర్వహించడం, ఆమె ఆరోగ్య సమస్యల విషయంలో నిపుణులతో బాధితురాలికి, ఆమె తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇవ్వాలని జస్టిస్ బాగ్చి వ్యాఖ్యానించారు. ఆ తర్వాత బాలిక, ఆమె తల్లిదండ్రులు తీసుకునే నిర్ణయాన్నే కోర్టు పరిగణనలోకి తీసుకుంటుందని స్పష్టం చేశారు.

గర్భాన్ని కొనసాగించడమే బిడ్డ శ్రేయస్సుకు మేలు : ఎయిమ్స్

లైంగికదాడి కారణంగా ఓ బాలిక గర్భం దాల్చగా ఆ కేసులో ఆమె ఇష్టానికి వ్యతిరేకంగా గర్భాన్ని మోయమని బలవంతం చేయలేమని సుప్రీంకోర్టు ధర్మాసనం గత విచారణలో వ్యాఖ్యానించింది. 20 వారాల(ఏడు నెలల) గర్భాన్ని తొలగించుకోవడానికి కోర్టు అనుమతిచ్చింది. ఈ ఆదేశాలను పున: సమీక్షించాలని ఆల్ ఇండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్) క్యూరేటివ్ పిటిషన్ దాఖలు చేసింది. ఏడు నెలల గర్భాన్ని తొలగిస్తే తీవ్రమైన వైకల్యాలతో శిశువు జన్మించే అవకాశం ఉందని అందులో ప్రస్తావించింది.

# అక్రిడేషన్ కార్డులను అందచేసిన పొంగులేటి

### అర్హులందరికీ అందచేస్తామని ప్రకటన

**హైదరాబాద్,: ఏప్రిల్ 30(జర్నలిస్ట్ వార్త);** జర్నలిస్టులు ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న కొత్త అక్రిడిటేషన్ కార్డుల పంపిణీ ప్రక్రియ ఎట్టకేలకు ప్రారంభమైంది. గురువారం హైదరాబాద్ హిమాయత్ నగర్‌లోని స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ కార్యాలయంలో రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి జర్నలిస్టులకు ఈ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్ కార్డులు అందజేస్తామని, ఇందులో ప్రభుత్వానికి ఎలాంటి రెండో ఆలోచన లేదని స్పష్టం చేశారు. ఒకవేళ కార్డు పొందిన తర్వాత ఎవరైనా సంస్థ మారితే, ఆ సమాచారాన్ని అధికారులకు తెలియజేస్తే వారి కార్డులను తొలగించబోమని భరోసా ఇచ్చారు. గత ప్రభుత్వ హయాంలో అక్రిడిటేషన్ల సంఖ్య 32 వేల నుండి 35 వేల మధ్య ఉండేదని, తమ ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన జీవోల వల్ల సుమారు 46 వేల మందికి లబ్ది చేకూరుతుందని తెలిపారు. ఇప్పటికే రాష్ట్ర స్థాయి కార్డుల్లో 2500 మందికి క్లియరెన్స్ ఇచ్చామని, జిల్లా స్థాయి కార్డుల మంజూరుపై అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశామని చెప్పారు. రాబోయే 15 రోజుల్లో అర్హులందరికీ కార్డుల మంజూరు పూర్తి చేస్తామని మంత్రి ప్రకటించారు. కొత్త దరఖాస్తులకు ఒక గడువు నిర్ణయించాల్సిన అవసరం ఉందని మంత్రి అభిప్రాయపడ్డారు. ఖచ్చితమైన సంఖ్య తెలిస్తే, దాని ఆధారంగా జర్నలిస్టుల కోసం మరిన్ని సంక్షేమ పథకాలు అమలు చేసేందుకు ప్రభుత్వం సానుకూల నిర్ణయాలు తీసుకుంటుందని పేర్కొన్నారు. పాత కార్డుల గడువు ముగియడంతో, యుద్ధ ప్రాతిపదికన కొత్త కార్డుల జారీని పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం జర్నలిస్టుల సంక్షేమానికి కట్టుబడి ఉందని ఈ సందర్భంగా ఆయన పునరుద్ఘాటించారు.

## బీసీ సంక్షేమ శాఖ అభివృద్ధి సలహాదారుగా వీహెచ్ నియామకం

**హైదరాబాద్,: ఏప్రిల్ 30(జర్నలిస్ట్ వార్త);**

రాష్ట్ర మంత్రి సమాన హోదాలో ఈ పదవిలో వీహెచ్ నియామకం కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎంపీ వి. హనుమంతరావు (వీహెచ్)కు తెలంగాణ ప్రభుత్వం సముచిత స్థానం కల్పించింది. బీసీ వర్గాల గళంగా గుర్తింపు పొందిన ఆయనను రాష్ట్ర ప్రభుత్వ బీసీ సంక్షేమ శాఖ అభివృద్ధి సలహాదారుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.వి. హనుమంతరావు గారిని రాష్ట్ర మంత్రి హోదాతో ఈ పదవిలో నియమించారు. దీని ప్రకారం ఆయనకు నెలకు రూ. 1,00,000 వేతనం అందనుంది. ఒకవేళ ప్రభుత్వ నివాసం కేటాయించకపోతే రూ. 50,000 ఇంటి అద్దె భత్యం (ఎ=ఖా) పొందే అవకాశం ఉంటుంది. ప్రయాణ ఖర్చుల కోసం రూ. 30,000 కన్వేయన్స్ అలవెన్స్, రూ. 15,000 ఇంధన ఖర్చులతో పాటు డ్రైవర్‌తో కూడిన ప్రభుత్వ వాహనాన్ని కూడా ప్రభుత్వం సమకూరుస్తోంది. వైద్య ఖర్చుల విషయంలో కూడా ఆయనకు అఖిల భారత సర్వీసు అధికారులు, మంత్రులతో సమానమైన రీయింబర్స్‌మెంట్ సౌకర్యం కల్పించారు.ఆయన కార్యకలాపాల కోసం బీసీ సంక్షేమ శాఖ ఒక ప్రైవేట్ సెక్రటరీ (పీఎస్), డేటా ఎంట్రీ ఆపరేటర్, ఆఫీస్ సబార్డినేట్లు, డ్రైవర్‌తో కూడిన ప్రత్యేక సిబ్బందిని కేటాయించింది. దశాబ్దాలుగా బీసీ హక్కుల కోసం పోరాడుతున్న హనుమంతరావు అపారమైన అనుభవం... ప్రభుత్వం అమలు చేయబోయే సంక్షేమ పథకాలకు దిశానిర్దేశం చేయడంలో కీలకం కానుంది. ముఖ్యంగా వెనుకబడిన తరగతుల అభివృద్ధి కోసం ప్రభుత్వం తీసుకునే నిర్ణయాల్లో ఆయన సలహాలు ఇప్పుడు అధికారిక ముద్ర వేయనున్నాయి.

# కన్నతల్లులపై కనికరం లేని తనయులు



**తల్లాడ/ఏప్రిల్ 30(జర్నలిస్ట్ వార్త);**
కన్నప్రేమ కరువైంది.. కని పెంచి పెద్ద చేసిన తల్లులను కంటికి రెప్పలా కాపాడాల్సిన కొడుకులు కసాయిలుగా మారారు. మండల పరిధిలోని కుర్నవల్లి గ్రామానికి చెందిన ఇనపనూరి ఎల్లమ్మ (68), పోతురాజు భాగ్యమ్మ (72) అనే వృద్ధుల దీనగాథ ఇది. వీరి కుమారులు ఆస్తులను తమ పేరిట రాయించుకుని, చివరకు కన్నతల్లులకు కనీసం ముద్ద అన్నం పెట్టడానికి, తలదాచుకోవడానికి నీడ కల్పించడానికి నిరాకరిస్తున్నారు. ఈ విషయమై స్థానిక పెద్దలు, అధికారులు పలుమార్లు పంచాయితీ నిర్వహించి నచ్చజెప్పినా కొడుకుల్లో మార్పు రాలేదు. చేసేదేమీ లేక బాధితులిద్దరూ తమ గోడును జిల్లా కలెక్టరుకు 'ప్రజావాణి'లో ఫిర్యాదు చేశారు. చట్టప్రకారం తల్లిదండ్రులను వేధించే పిల్లల ఆస్తులు, ఉద్యోగాలపై కఠిన చర్యలు తీసుకునేలా నిబంధనలు ఉన్నాయని, తమకు న్యాయం చేయాలని వృద్ధులు కన్నీటి పర్యంతమయ్యారు. వృద్ధులను రోడ్డున పడేయడంపై గ్రామస్థులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు

# పది ఫలితాల్లో మల్లవరం మేటి



**తల్లాడ/ ఏప్రిల్ 30(జర్నలిస్ట్ వార్త);**
పదో తరగతి ఫలితాల్లో మండల పరిధిలోని మల్లవరం విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరచడం గర్వకారణమని సర్పంచ్ కటికి కిరణ్ కుమార్ పేర్కొన్నారు. గురువారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో ప్రతిభావంతులకు అభినందన సభ నిర్వహించారు. మండల స్థాయిలో ప్రథమ స్థానం సాధించిన దుగ్గిదేవర ఉజ్వల (583 మార్కులు), ఉత్తమ మార్కులు సాధించిన ఎర్రి భవాని, కటికి భవాని, బండ్ల రాజా సాత్విక్ (570 మార్కులు)లను సర్పంచ్ శాలువాలతో ఘనంగా సన్మానించారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కష్టపడి చదివి తల్లిదండ్రులకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. అనంతరం ఉపసర్పంచ్ ధరావత్ యశోదతో కలిసి విద్యార్థులకు జూట్ ఫైళ్లను బహుకరించారు. కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు డి. సీతారామయ్య, మాజీ ఉపసర్పంచ్ నరసింహారావు, కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు ఎర్రి కృష్ణారావు, ఎస్టీ సెల్ అధ్యక్షుడు భూక్య అంజయ్య, యువజన కాంగ్రెస్ కార్యదర్శి రవీంద్ర, లైన్స్ క్లబ్ ప్రతినిధులు బెల్లంకొండ అంజయ్య, రేగళ్ల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# దివ్యాంగులకు అన్నదానం.. చిన్నారికి ఆశీస్సులు



**మధిర/ఏప్రిల్ 30(జర్నలిస్ట్ వార్త);**
చిన్నారి అన్నప్రాశన వేడుకను పురస్కరించుకుని నిస్సహాయులకు అన్నదానం చేయడం అభినందనీయమని మదర్ థెరిస్సా సేవాసదన నిర్వాహకులు పేర్కొన్నారు. రొంపిమళ్ల వాస్తవ్యులు తలపురెడ్డి కృష్ణారెడ్డి - కృష్ణమ్మల మనవరాలు, గోవర్ధన్ రెడ్డి - హర్షితల కుమార్తె బేబీ జశ్విక అన్నప్రాశన సందర్భంగా బుధవారం మధిరలోని మానసిక దివ్యాంగుల పునరావాస కేంద్రంలో అన్న వితరణ చేశారు. చిన్నారి జేజి నాగేంద్రమ్మతో పాటు అమ్మమ్మ, తాతయ్యలు మేకపోతుల నర్సిరెడ్డి - అనురాధ (అల్లూరు) తమ కుటుంబ సభ్యులతో కలిసి దివ్యాంగులకు స్వయంగా భోజనాలు వడ్డించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. పసిపాప జశ్విక ఆయురారోగ్యాలతో, ఉన్నత విద్యావంతురాలిగా ఎదగాలని ఆకాంక్షిస్తూ దివ్యాంగ పిల్లల తరపున ప్రత్యేక ప్రార్థనలు చేశారు. విందు వేడుకల కోసం వృథా ఖర్చులు చేయకుండా, ఇలాంటి సేవా కేంద్రాల్లో ఆకలి తీర్చడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, సేవాసదన సిబ్బంది పాల్గొన్నారు.

# పది ఫలితాల్లో సదాశివునిపాలెం జెడ్పీహెచ్ఎస్ జయకేతనం



**సత్తుపల్లి/ఏప్రిల్ 30(జర్నలిస్ట్ వార్త);**
పదో తరగతి ఫలితాల్లో సత్తుపల్లి మండలంలోని సదాశివునిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. ఈ ఏడాది పరీక్షలకు హాజరైన 26 మంది విద్యార్థులూ ఉత్తీర్ణత సాధించి 100 శాతం ఫలితాలను నమోదు చేశారు. ముఖ్యంగా విద్యార్థిని గుదె లాస్య ప్రసన్న 600 మార్కులకు గాను 578 మార్కులు సాధించి, నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లోనే టాపర్‌గా నిలిచింది. ఇంగ్లీష్ మీడియం మొదటి బ్యాచ్‌లోనే ఈ స్థాయి విజయం లభించడం విశేషం.
పాఠశాల నుంచి ఎనిమిది మంది విద్యార్థులు 500కు పైగా మార్కులు సాధించారు. బాల శ్రీలక్ష్మి (553), చైత్ర (552), రితీష్ కుమార్ (544) ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా హెచ్.ఎం. దమ్మలపాటి కమలకుమారి మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల కృషి, విద్యార్థుల పట్టుదల వల్లే ఈ విజయం సాధ్యమైందన్నారు. ప్రతిభ చాటిన విద్యార్థులను గ్రామ పెద్దలు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులు మరియు ఉపాధ్యాయ బృందం ఘనంగా అభినందించారు.

# అక్షయ పాత్రగా లయన్స్ అల్పాహారం

## నిరంతరాయంగా 900 రోజులు పూర్తి.. -రోజుకు 200 మందికి పైగా ఆకలి తీరుస్తున్న వైనం





**సత్తుపల్లి/ ఏప్రిల్ 30(జర్నలిస్ట్ వార్త);**
ఆకలితో ఉన్న పేదవాడికి ఒక పూట అన్నం పెడితే కలిగే తృప్తి వెలకట్టలేనిది. ఆ తృప్తి కోసం సత్తుపల్లి లయన్స్ క్లబ్ చేస్తున్న కృషి నేటితో 900 రోజులకు చేరుకుంది. లయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ సేవా స్ఫూర్తితో ప్రారంభమైన వీల్స్ ఆన్ మీల్స్ ఉచిత అల్పాహార పంపిణీ కార్యక్రమం బుధవారం నాటికి దిగ్విజయంగా 900 రోజులు పూర్తి చేసుకుంది.గత రెండున్నరేళ్లకు పైగా ఎటువంటి విరామం లేకుండా ఈ కార్యక్రమం కొనసాగుతోంది. ప్రతిరోజూ ఉదయం స్థానిక బస్టాండ్ సెంటర్, ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణాలలో రోగులకు, వారి సహాయకులకు, నిరుపేదలకు, యాచకులకు క్లబ్ సభ్యులు అల్పాహారాన్ని పంపిణీ చేస్తున్నారు. రోజుకు సగటున 200 మంది ఈ పథకం ద్వారా లబ్ధి పొందుతున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సేవల విస్తరణ విభాగం నిర్వాహకులు మందపాటి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ దాతల నుంచి లభిస్తున్న అపారమైన సహకారం వల్లే ఈ యజ్ఞం ఆటంకం లేకుండా సాగుతోందని కొనియాడారు. భవిష్యత్తులో ఈ సేవలను మరింత విస్తరిస్తామని భరోసా ఇచ్చారు. క్లబ్ అధ్యక్షులు గోగడ రవికుమార్ మాట్లాడుతూ స్థానిక దాతలు అందిస్తున్న ఆర్థిక సహాయం ఈ కార్యక్రమానికి వెన్నెముకగా నిలుస్తోందని, వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సుదీర్ఘ ప్రయాణంలో నిత్యం సేవలందిస్తున్న మందపాటి ప్రభాకర్ రెడ్డి గౌతమ్ పాఠశాల నిర్వాహకులు ఆహార సరఫరా, వడ్డనలో అంకితభావంతో పనిచేస్తున్న రాంబాబును క్లబ్ సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ బాధ్యులు పెనుగొండ రమేష్, దారా కృష్ణారావు, కొత్తూరు సత్యనారాయణ, పసుపులేటి నాగేశ్వరరావు (మేధా లయన్స్), మొరిశెట్టి సాంబశివగుప్తా, దొడ్డ కృష్ణయ్య, జంగా సత్యనారాయణ, చల్లగుండ్ల అప్పారావు, మిద్దె శ్రీను, స్టార్ క్లబ్ బాధ్యులు విజయ సారధి రెడ్డి, ఎస్.కె. వలి, సన్నీ తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధే లక్ష్యం.. ప్రజారోగ్యమే ప్రాధాన్యం

**ఎల్కతుర్తి/ ఏప్రిల్ 30(జర్నలిస్ట్ వార్త);**
గ్రామ సమగ్ర అభివృద్ధే ధ్యేయంగా, ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని బావుపేట సర్పంచ్ బత్తిని రవీందర్ గౌడ్ అన్నారు. బుధవారం నిర్వహించిన గ్రామ సభలో ఆయన మాట్లాడుతూ వేసవి దృష్ట్యా గ్రామంలో నీటి ఎద్దడి తలెత్తకుండా చూడడమే తన మొదటి బాధ్యతని పేర్కొన్నారు. ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక'లో భాగంగా మురికి కాలువల ప్రక్షాళన, రహదారుల శుభ్రత, ఇరువైపులా మొక్కల పెంపకానికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు.
గ్రామానికి మంజూరైన 17 ఇంద్రమ్మ ఇళ్లలో కొన్ని ఇప్పటికే పూర్తి కాగా, మిగిలినవి నిర్మాణ దశలో ఉన్నాయని.. లబ్ధిదారులకు నిధుల విడుదలపై



కాలయాపన లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీల్లో వసతులు మెరుగుపరిచి విద్యార్థుల సంఖ్యను పెంచుతామన్నారు.



యువత పెడదోవ పట్టకుండా గ్రామ ప్రగతిలో భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి శ్రీనివాస్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

# పది ఫలితాల్లో కార్తీక్ విద్యాలయం విజయభేరి

**వైరా/ ఏప్రిల్ 30(జర్నలిస్ట్ వార్త)**
ఇటీవల విడుదలైన పదో తరగతి ఫలితాల్లో వైరా నియోజకవర్గం పల్లిపాడులోని కార్తీక్ విద్యాలయం విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి ప్రభంజనం సృష్టించారు. పాఠశాల నుంచి పరీక్షలకు హాజరైన 36 మంది విద్యార్థులు అందరూ ఉత్తీర్ణత సాధించి, 100 శాతం ఫలితాలతో విద్యాసంస్థ సత్తా చాటింది. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ , ప్రిన్సిపాల్ నల్లబోలు మాధవ రెడ్డి మాట్లాడుతూ తమ విద్యార్థులు ప్రతి ఏడాదిలాగే ఈసారి కూడా అత్యుత్తమ మార్కులతో రాణించారని గర్వంగా వెల్లడించారు.



పాఠశాలకు చెందిన గంజి యువ సాయి గణేష్ 575/600, కొండపల్లి లేఖన 564/600 మార్కులు సాధించి పాఠశాల



టాపర్లుగా నిలిచారని తెలిపారు.
పరీక్ష రాసిన 36 మందిలో అందరూ ఉత్తీర్ణులయ్యారు. అత్యధిక శాతం మంది విద్యార్థులు 500 పైగా మార్కులు సాధించడం విశేషం. క్రమశిక్షణ, ఉపాధ్యాయుల ప్రత్యేక బోధన వల్లే ఈ ఫలితాలు సాధ్యమయ్యాయని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను, వారికి సహకరించిన ఉపాధ్యాయ బృందాన్ని మరియు తల్లిదండ్రులను పాఠశాల యాజమాన్యం ప్రత్యేకంగా అభినందించింది. భవిష్యత్తులో కూడా ఇదే తరహా ఫలితాలను కొనసాగిస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొని మిఠాయిలు పంచుకుని సంబరాలు చేసుకున్నారు.

# పేదల ఇంట.. ఇందిరమ్మ వెలుగు

## వర్ధన్నపేటలో ఘనంగా గృహప్రవేశాలు

### లబ్ధిదారులతో కలిసి పాలు పొంగించిన మున్సిపల్ చైర్మన్ -సొంతింటి కల నెరవేరడంతో బాధితుల ఆనందం







**వర్ధన్నపేట/ఏప్రిల్ 30(జర్నలిస్ట్ వార్త);**
నిరుపేదల సొంతింటి కలను నిజం చేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని వర్ధన్నపేట మున్సిపల్ చైర్మన్ పాలకుర్తి సారంగపాణి అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 8వ వార్డులో ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద నిర్మించిన గృహాలకు గురువారం లబ్ధిదారులు సామూహికంగా గృహప్రవేశాలు చేశారు. ఈ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించిన ఈ గృహాల వద్ద ఉదయం నుంచే పండుగ వాతావరణం నెలకొంది. చైర్మన్ సారంగపాణి స్వయంగా లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి, వారితో కలిసి పాలు పొంగించి గృహప్రవేశాలను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సొంత గూడు లేక ఏళ్ల తరబడి అద్దె ఇళ్లలో మగ్గుతున్న పేదలకు ఈ పథకం ఒక భరోసాగా నిలిచిందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సకాలంలో గృహాలను అందించి, వారి ముఖాల్లో చిరునవ్వు చూడటమే ప్రభుత్వ ధ్యేయమని పేర్కొన్నారు. ప్రజా ప్రభుత్వం అత్యంత నాణ్యమైన ప్రమాణాలతో ఈ ఇళ్లను నిర్మించిందని, నిరుపేదలు ఆత్మగౌరవంతో జీవించేందుకు ఇవి దోహదపడతాయని ఆయన వెల్లడించారు. కొత్త ఇంట్లోకి అడుగుపెడుతున్న ఆనందంలో లబ్ధిదారులు మునిగిపోయారు. తమ కల నిజం చేసిన ప్రభుత్వానికి వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులతో పాటు స్థానిక నాయకులు నేతవత్ రాజేందర్, పూజారి శ్రీనివాస్, ఒక్కతట్ల రాజు, మాలోతు దేవేందర్, లింగం రజిత రెడ్డి, పాక సుజాత, పాలకుర్తి శ్రీకాంత్ , వార్డు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రారంభానికే పరిమితమైన కొనుగోలు

**నాలుగు రోజులు గడిచినా మొదలవ్వని తూకాలు -అయోమయంలో అన్నదాతలు.. ఇబ్బందుల్లో రైతాంగం**



**వర్ధన్నపేట/ఏప్రిల్ 30(జర్నలిస్ట్ వార్త);**
మండల కేంద్రంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ ప్రహసనంగా మారింది. నాలుగు రోజుల క్రితమే కొనుగోలు కేంద్రాన్ని అట్టహాసంగా ప్రారంభించిన అధికారులు, ఇప్పటి వరకు కాంటాలు మొదలుపెట్టకపోవడంపై రైతాంగం తీవ్ర నిరసన వ్యక్తం చేస్తోంది. క్షేత్రస్థాయిలో యంత్రాంగం నిర్లక్ష్యం వల్ల రైతులు ధాన్యం కుప్పల వద్దే పడిగాపులు కాయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

**ఆంక్షల వలయంలో అన్నదాత**

గత ప్రభుత్వ హయాంలో ఎలాంటి నిబంధనలు లేకుండా ప్రతి గ్రామంలో కొనుగోలు కేంద్రాలు ఉండేవని, ఇప్పుడు ఆ పరిస్థితి కనిపించడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే నియోజకవర్గ వ్యాప్తంగా 60 శాతానికి పైగా వరి కోతలు పూర్తయ్యాయి. ఆరబెట్టిన ధాన్యాన్ని కాపాడుకోవడం రైతులకు సవాలుగా మారింది. ఒకవైపు మండుతున్న ఎండలు, మరోవైపు అకాల వర్షాల భయంతో ధాన్యం కుప్పలను భద్రపరుచుకోలేక అన్నదాతలు సతమతమవుతున్నారు.

**టోకెన్ల విధానం ఎక్కడ?**

కొనుగోలు కేంద్రాల వద్ద అధికారులను నియమించి, రైతులకు ముందస్తుగా టోకెన్లు జారీ చేస్తే ఈ ఇబ్బందులు ఉండేవి కావని మండల నాయకులు అభిప్రాయపడ్డారు. సరైన సమాచారం లేకపోవడంతో రైతులు ధాన్యాన్ని ట్రాక్టర్లలో నింపుకుని కేంద్రాల వద్ద గంటల తరబడి వేచి చూడాల్సి వస్తోంది. ప్రభుత్వం వెంటనే స్పందించి తూకాలు ప్రారంభించాలని డిమాండ్ చేశారు.
ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు తూళ్ల కుమారస్వామి, పట్టణ అధ్యక్షుడు గోధుమల మధుసూదన్ మాట్లాడుతూ.. రైతులకు ఇబ్బంది కలగకుండా తక్షణమే యంత్రాంగం చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్ సిల్వర్ కుమారస్వామి, గుజ్జ వీరన్న, తిరుపతి సురేష్, తుమ్మల శ్రీధర్, బాణోతు నవీన్, సింగరాబోయిన రాజశేఖర్, సోషల్ మీడియా ఇన్చార్జి సిల్వర్ శ్రీధర్, మాజీ సర్పంచ్ కర్ర వెంకట్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ వసంత్ తదితరులు పాల్గొన్నారు.

# వన్యప్రాణుల నిలయం.. సత్తుపల్లి అడవి



**సత్తుపల్లి/ఏప్రిల్ 30(జర్నలిస్ట్ వార్త);**
సత్తుపల్లి అటవీ ప్రాంతం అరుదైన వన్యప్రాణులకు సురక్షిత ఆవాసంగా మారుతోంది. ఈ ప్రాంతంలో అరుదైన ఇండియన్ బైసన్లు (అడవి దున్నలు) స్వేచ్ఛగా విహరిస్తున్న దృశ్యాలు పర్యావరణ ప్రేమికులను ఆకట్టుకుంటున్నాయి. వేసవి తీవ్రత దృష్ట్యా దాహార్తిని తీర్చుకోవడానికి ఈ వన్యప్రాణులు అటవీ సమీపంలోని నీటి కుంటల వద్దకు చేరుతున్నాయి. చంద్రాయపాలెం, రేగళ్లపాడు, యాతాలకుంట పరిధిలోని దట్టమైన అడవుల్లో అడవి దున్నలతో పాటు చుక్కల దుప్పులు, అడవి పందులు యథేచ్ఛగా సంచరిస్తున్నాయి. అడవులు దట్టంగా పెరగడం, నీటి లభ్యత ఉండటంతో వన్యప్రాణుల సంఖ్య పెరుగుతోందని, ఇది జీవవైవిధ్యానికి శుభసూచకమని అటవీశాఖ అధికారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అయితే, వన్యప్రాణుల సంచారం పెరిగిన నేపథ్యంలో వేటగాళ్ల ముప్పు పొంచి ఉందని పర్యావరణ ప్రేమికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అటవీ ప్రాంతాల్లో కరెంట్ తీగలు, ఉచ్చులు వేయకుండా గట్టి నిఘా ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. వన్యప్రాణుల సంరక్షణకు అధికారులు మరిన్ని చర్యలు చేపడితే, ఈ ప్రాంతం అరుదైన జంతు ప్రదర్శనశాలగా మారుతుందని స్థానికులు భావిస్తున్నారు.

# పేదరికాన్ని జయించి.. పదిలో మెరిసి!

**కక్కిరాలపల్లి విద్యార్థినుల ప్రతిభ -భవ్యశ్రీ, సమ్రీన్‌లకు గ్రామస్థుల సన్మానం**







**ఐనవోలు/ఏప్రిల్ 30(జర్నలిస్ట్ వార్త);**
చదువుకోవాలనే పట్టుదల ఉంటే పేదరికం అడ్డుకాదని ఐనవోలు మండలం కక్కిరాలపల్లికి చెందిన విద్యార్థినులు నిరూపించారు. తాజాగా విడుదలైన పదో తరగతి ఫలితాల్లో గ్రామానికి చెందిన కంజర్ల భవ్యశ్రీ 534 మార్కులు, మహమ్మద్ సమ్రీన్ 493 మార్కులు సాధించి పాఠశాల స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. ముఖ్యంగా భవ్యశ్రీ టీజీ ఎస్డబ్ల్యూఆర్ఎస్ పాఠశాలలో ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకుని సత్తా చాటింది.

**ఘనంగా సన్మానంద**

నిరుపేద కుటుంబాలకు చెందిన ఈ విద్యార్థినులు సాధించిన విజయాన్ని గుర్తిస్తూ.. గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ బర్ల వాణి రవికుమార్ ఆధ్వర్యంలో గురువారం అభినందన సభ నిర్వహించారు. విద్యార్థినులతో పాటు వారి తల్లిదండ్రులను, గురువులను గ్రామ ప్రముఖులు శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారికి నగదు పురస్కారాలను కూడా అందజేశారు. స్ఫూర్తిదాయకంసర్పంచ్ మాట్లాడుతూ కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని విద్యార్థినులను కోరారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు వీరి విజయం స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శి వెంకటేష్, మాజీ సర్పంచ్ పడిదల సమ్మరావు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ గుండపు సుభద్ర, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్, వార్డు సభ్యులు బర్ల నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# బొర్రా వెంకటేశ్వర్లు సేవలు చిరస్మరణీయం



**వైరా/ఏప్రిల్ 30(జర్నలిస్ట్ వార్త);**సీనియర్ కాంగ్రెస్ నాయకులు, సోమవరం మాజీ సర్పంచ్ స్వర్గీయ బొర్రా వెంకటేశ్వర్లు 5వ వర్ధంతి వేడుకలను గురువారం వైరాలో ఘనంగా నిర్వహించారు. స్థానిక మండల కాంగ్రెస్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నాయకులు ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా మార్క్ ఫెడ్ మాజీ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, మున్సిపల్ మాజీ చైర్మన్ జైపాల్ మాట్లాడుతూ సామాన్య కార్యకర్తగా ప్రస్థానం ప్రారంభించి, ప్రజా సమస్యల పరిష్కారంలో వెంకటేశ్వర్లు చేసిన కృషి మరువలేనిదని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శీలం నర్సిరెడ్డి, ఏఎంసీ చైర్మన్ బోళ్ళ గంగారావు, నాయకులు మిట్టపల్లి నాగి, దార్న శేఖర్, కాంపాటి శేషగిరి, వైస్ చైర్మన్ కట్ల సంతోష్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు గరిడేపల్లి కిషోర్ , నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న అభిమానులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి ఆయనతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. కౌన్సిలర్ మోర్ శ్రీకాంత్, పాలేటి నరసింహారావు, ఆత్మ కమిటీ డైరెక్టర్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# లేబర్ కోడ్లపై కార్మిక వర్గం ఆగ్రహం

**మేడే స్ఫూర్తితో పోరాటం చేయాలి- ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు గుంపెల్లి మునీశ్వర్**

**వర్ధన్నపేట/ఏప్రిల్ 40(జర్నలిస్ట్ వార్త);;**
కార్మిక హక్కులను హరించేలా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్లపై కార్మిక వర్గం ఐక్యంగా పోరాటం చేయాల్సిన అవసరం ఉందని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు గుంపెల్లి మునీశ్వర్ పిలుపునిచ్చారు. ఇల్లంద వ్యవసాయ మార్కెట్‌లో ఏఐటీయూసీ హమాలి యూనియన్ ఆధ్వర్యంలో 141వ మేడే పోస్టర్‌ను ఆవిష్కరించిన సందర్భంగా ఆయన మాట్లాడారు.మేడే పోరాటాల చరిత్రను స్మరించుకుంటూ 1886లో అమెరికాలోని చికాగో హే మార్కెట్ ఘటనను ఆయన ప్రస్తావించారు. పని గంటల తగ్గింపు, న్యాయమైన వేతనాల కోసం పోరాడిన కార్మికులపై జరిగిన కాల్పులు, హింసాత్మక ఘటనలు ప్రపంచ కార్మిక ఉద్యమానికి నాంది పలికాయని చెప్పారు. ఆ పోరాటాల ఫలితంగానే ఎనిమిది




గంటల పని దినం, వారాంతపు సెలవులు వంటి హక్కులు సాధ్యమయ్యాయని వివరించారు.
ప్రపంచవ్యాప్తంగా కార్మిక ఉద్యమాలు బలపడగా, మనదేశంలో మాత్రం కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా వ్యవహరిస్తూ, కార్మిక హక్కులను దెబ్బతీస్తోందని మునీశ్వర్ విమర్శించారు. నాలుగు లేబర్ కోడ్ల పేరుతో యూనియన్ హక్కులను పరిమితం చేయడం, పని గంటలను పెంచడం, యాజమాన్యాలకు అధిక అధికారాలు కల్పించడం జరుగుతోందని ఆరోపించారు.పబ్లిక్ సెక్టార్‌ను ప్రైవేటుపరం చేస్తూ లక్షలాది కార్మికుల భవిష్యత్తును సంకటంలోకి నెట్టే విధానాలే ఇవని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మేడే స్ఫూర్తితో కార్మిక వర్గం ఐక్యంగా ముందుకు వచ్చి, ఈ కార్మిక వ్యతిరేక విధానాలనుతిప్పికొట్టాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు, హమాలి యూనియన్ సభ్యులు
మంద భాస్కర్,చికటి సురేష్, బొమ్మర ఉప్పలయ్య, ఆబార్ల బిక్షపతి, బోంతల శ్రీ కరిత,ఎల్పుల కుమార్, మైదం సాంబ రాజు, మార్కెట్ కమిటి, తదితరులు పాల్గొన్నారు.

# రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



**వర్ధన్నపేట/ఏప్రిల్ 30(జర్నలిస్ట్ వార్త);**
వ్యవసాయాన్ని పండుగ చేయడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని వర్ధన్నపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ నరుకుడు వెంకటయ్య పేర్కొన్నారు. గురువారం మండలంలోని దివిటిపెల్లి గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన యాసంగి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం ద్వారా లభించే మద్దతు ధరతో పాటు సన్న రకం ధాన్యానికి క్వింటాల్‌కు రూ. 500 బోనస్ పొందాలని రైతులను కోరారు.
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం రైతు భరోసా, రుణమాఫీ వంటి పథకాలతో సాగుకు అండగా నిలుస్తోందన్నారు. ధాన్యం కొనుగోలు వల్ల ప్రభుత్వానికి ఆర్థికంగా నష్టం వచ్చినా, రైతులు నష్టపోకూడదనే ఉద్దేశంతో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రైతులు దళారులను నమ్మి మోసపోకుండా, ధాన్యాన్ని ఆరబెట్టి కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎద్దు సత్యం, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అబిడీ రాజ్‌రెడ్డి, నాయకులు పోశాల వెంకన్న గౌడ్, కర్కా నరసింహ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన పేదలందరికీ 'ఇందిరమ్మ' ఇళ్లు ఇవ్వాలి



**వర్ధన్నపేట/ ఏప్రిల్ 30(జర్నలిస్ట్ వార్త);**
సొంత గూడు లేని ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వం తక్షణమే ఇందిరమ్మ పథకం కింద ఇళ్లు మంజూరు చేయాలని సి.పి.ఐ మండల కార్యదర్శి బొడ్డుపల్లి సాయిలు డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. నియోజకవర్గంలో ఏళ్ల తరబడి అద్దె ఇళ్లలో నివసిస్తున్న పేదల పరిస్థితి దయనీయంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకంపై ప్రకటనలు చేయడం కాకుండా, క్షేత్రస్థాయిలో అర్హులను గుర్తించి త్వరితగతిన నిధులు విడుదల చేయాలని కోరారు. గతంలో దరఖాస్తు చేసుకున్న అనేక మంది పేదలు ఇప్పటికీ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారని, రాజకీయాలకు అతీతంగా నిజమైన లబ్ధిదారులకు న్యాయం చేయాలని కోరారు. ఇళ్ల స్థలాలు ఉన్న వారికి నిర్మాణానికి అవసరమైన ఆర్థిక సాయాన్ని వెంటనే అందజేయాలని, లేని వారికి స్థలంతో పాటు ఇళ్లు నిర్మించి ఇవ్వాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. పేదలకు ఇళ్లు ఇచ్చే వరకు తమ పార్టీ తరఫున పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు.

## కేజీబీవీ ప్రగతికి అనితాదేవి మార్కు..

**క్రమశిక్షణతోనే ఉన్నత ఫలితాలు!**

**ఎల్కతుర్తి/ఏప్రిల్ 30 (జర్నలిస్ట్ వార్త:** అంకితభావంతో పనిచేస్తే ప్రభుత్వ విద్యాలయాలను కూడా ఆదర్శంగా తీర్చిదిద్దవచ్చని ఎల్కతుర్తి కేజీబీవీ ప్రిన్సిపాల్ అనితాదేవి నిరూపిస్తున్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థినుల భవిష్యత్తును బంగారుమయం చేయడమే లక్ష్యంగా ఆమె సాగిస్తున్న కృషి ఇప్పుడు అందరి దృష్టిని ఆకర్షిస్తోంది.పాఠశాల బాధ్యతలు చేపట్టిన నాటి నుండి, అనితాదేవి విద్యా ప్రమాణాల మెరుగుదలపై ప్రత్యేక దృష్టి సారించారు. వెనుకబడిన వర్గాలకు చెందిన విద్యార్థినులకు నాణ్యమైన విద్యతో పాటు, ఇంటర్మీడియట్‌లో అత్యుత్తమ ఫలితాలు సాధించేలా ప్రత్యేక ప్రణాళికలు అమలు చేస్తున్నారు. కేవలం చదువే కాకుండా, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లోనూ విద్యార్థినులు రాణించేలా ప్రోత్సహిస్తున్నారు.




విద్యార్థినుల సంక్షేమం విషయంలో ఆమె రాజీపడరు. పాఠశాల పరిసరాల పరిశుభ్రత, మెనూ ప్రకారం పౌష్టికాహారం అందేలా నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. వసతి గృహంలో వారికి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఒక తల్లిలా సంరక్షిస్తూ, వారిలో ఆత్మవిశ్వాసాన్ని నింపుతున్నారు. ఆమె నాయకత్వంలో ఎల్కతుర్తి కేజీబీవీ ఒక మోడల్ స్కూల్‌గా రూపుదిద్దుకుంటోందని స్థానికులు, అధికారులు కొనియాడుతున్నారు. చదువుతో పాటు క్రమశిక్షణ, సామాజిక బాధ్యత నేర్పినప్పుడే విద్యార్థినుల భవిష్యత్తు బాగుంటుందని, , ఎల్కతుర్తి కేజీబీ ప్రిన్సిపాల్ అనితాదేవి తెలిపారు.

## పలు శుభకార్యాలలో పాల్గొన్న బయ్యారం సర్పంచ్.

**-శాంతి కిషన్ నాయక్.**

**బయ్యారం/,ఏప్రిల్ 30.(జర్నలిస్ట్ వార్త)**
బయ్యారం, జగ్గుతండ గ్రామ పంచాయతీలలో పలు వివాహ రిసెప్షన్ కార్యక్రమాలలో పాల్గొని నూతన వధువరులని ఆశీర్వదించిన బయ్యారం సర్పంచ్ గుగులోత్ శాంతి కిషన్ నాయక్.మండల కేంద్రంలో మాదిరెడ్డి సునీల్ రెడ్డి పెళ్లి రిసెప్షన్ కార్యక్రమంలో పాల్గొని నూతన వధువరులని ఆశీర్వదించిన బయ్యారం సర్పంచ్ అనంతరం



జగ్గుతండ గ్రామపంచాయతీలోని నెహ కన్వెన్షన్ హాలులో మొటూరి శ్రీకాంత్,శిరీష రీసెప్షన్ లో పాల్గొని నూతన వధువరులని ఆశీర్వదించారు.అనంతరం చెన్నంగుల గడ్డ గ్రామంలో కారం బిక్షం కూతురు కారం మమత,నరేష్ పెళ్లి కార్యక్రమంలో పాల్గొని ఆశీర్వదించారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కిషన్ నాయక్,నాయిని శ్రీనివాస్ రెడ్డి,నందగిరి భద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

# పది ఫలితాల్లో మండలంలో మొదటి స్థానం సాధించిన మారుతి లావణ్య..

## -విద్యార్థినిలను సన్మానించిన సర్పంచ్.



**బయ్యారం/,ఏప్రిల్ 30.(జర్నలిస్ట్ వార్త)**
బయ్యారం మండలం గంధంపల్లి కొత్తపేట గ్రామపంచాయతీ పరిధిలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాల విద్యార్థులు అద్భుతమైన ప్రతిభ చూపారు.మండల స్థాయిలో మొదటి స్థానం సాధించిన మారుతి లావణ్య,మండల స్థాయి ఐదవ స్థానం సాధించిన నీలం వర్షితలకు సర్పంచ్ భూక్య ప్రవీణ్ నాయక్ శాలువాతో ఘనంగా సన్మానించారు.విద్యార్థినిలు భవిష్యత్తులో మరెన్నో విజయాలు సాధించాలని అభినందించారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ రావి వీరభద్ర రావు, వార్డు సభ్యులు చల్ల సురేష్,బోమ్మకంటి రాంబాబు,ఈసం స్వరూప,భూక్య శ్రీనివాస్,పంచాయతీ కార్యదర్శులు జక్కి రఘువీర్,షేక్ నౌరాక్ అలీ,కొండ సంతోష్,పాఠశాల ఉపాధ్యాయులు,విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# జగ్గుతండ జిపిలో తాగునీటీ సమస్యలకు చెక్.

## -సర్పంచ్ బొల్లి జయంతి వెంకటకృష్ణ.



**బయ్యారం/,ఏప్రిల్ 30.(జర్నలిస్ట్ వార్త)**
జగ్గుతండ గ్రామంలో మిషన్ భగీరథ నీరు అంతరాయం వల్ల గ్రామ ప్రజలకు తాగునీరు ఇబ్బందులను గ్రహించిన సర్పంచ్ బొల్లి జయంతి జయంతి వెంకట కృష్ణ,ఉపసర్పంచ్ గుంజ వీరస్వామి ఆధ్వర్యంలో పాలకవర్గం బోరులకు మరమ్మత్తులు చెపించే కార్యక్రమం చేపట్టారు.గురువారం పంచాయతీలో ఐదవ వార్డు,పదో వార్డులో నిరూపయోగంగా ఉన్న బోర్లను రిప్రెషన్ చేయించారు.రాబోయే రోజుల్లో పాలకవర్గం ఆధ్వర్యంలో మిగతా బోర్లను కూడా రిఫ్రెషింగ్ చేయించి వేసవి కాలంలో గ్రామ ప్రజలకు నీటి కష్టాలు రాకుండా చూస్తామని సర్పంచి బొల్లి జయంతి వెంకటకృష్ణ అన్నారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు స్వాతి,రాఘవేంద్ర,గ్రామ పెద్దలు యువకులు,పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

**గీసుకొండ/ ఏప్రిల్ 30(జర్నలిస్ట్ వార్త);**




ఎండల తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు అగ్ని ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సి.ఐ విశ్వేశ్వర్ సూచించారు. గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ.వ్యవసాయ పొలాలు, నివాస ప్రాంతాల్లో అగ్ని ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు పాటించాలని కోరారు. ముఖ్యంగా పొలాల్లో ఎండిన గడ్డి, చెత్తను కాల్చకూడదని, సిగరెట్లు, బీడీలు తాగి నిర్లక్ష్యంగా పడేయవద్దని హెచ్చరించారు.ఇళ్లలో గ్యాస్ లీకేజీలు, విద్యుత్ షార్ట్ సర్క్యూట్లు జరగకుండా వైరింగ్‌ను తరచుగా తనిఖీ చేసుకోవాలన్నారు. వాహనాల్లో పెట్రోల్, ఇతర రసాయన పదార్థాలను ఉంచరాదని తెలిపారు. విద్యుత్ తీగలు, ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద అప్రమత్తంగా ఉండాలని, ఏదైనా ప్రమాదం సంభవిస్తే వెంటనే ఫైర్ సర్వీస్ (101) లేదా డయల్ 100 కు సమాచారం అందించాలని కోరారు. ప్రజల ప్రాణ, ఆస్తి నష్టాల నివారణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# ఎస్సెస్సీ ఫలితాల్లో జిల్లా టాపర్‌గా బొంతల సృజన

## జిల్లా టాపర్ అభినందించిన ప్రజాప్రతినిధులు




**భీమదేవరపల్లి/ఏప్రిల్29 (జర్నలిస్ట్ వార్త):** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలోని పీఎం శ్రీ జీఎస్ఎస్ఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గట్లనర్సింగాపూర్‌కు చెందిన విద్యార్థిని బొంతల సృజన ఎస్సెస్సీ పరీక్షా ఫలితాల్లో అద్భుత ప్రతిభ కనబరిచి జిల్లా టాపర్‌గా నిలిచింది. పదవ తరగతి పరీక్షల్లో 600 మార్కులకు గాను 577 మార్కులు సాధించి జిల్లా పరిషత్ విభాగంలో ప్రథమ స్థానం దక్కించుకుంది. అంతేకాకుండా భీమదేవరపల్లి మండలంలోని అన్ని పాఠశాలల విభాగంలో కూడా మొదటి స్థానంలో నిలిచి పాఠశాలకు, మండలానికి గర్వకారణంగా మారింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు డోరి రమేష్ మాట్లాడుతూ, సృజన సాధించిన విజయం పాఠశాలకు ఎంతో గౌరవం తీసుకువచ్చిందన్నారు. మండల, జిల్లా స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన సృజనను కావేరి సీడ్స్ మేనేజింగ్ డైరెక్టర్, చైర్మన్ కావేరి భాస్కరరావు, సర్పంచ్ బొల్లంపల్లి అజయ్ కుమార్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ కొక్కిస కోమల ఘనంగా అభినందించారు.
అదేవిధంగా 500కు పైగా మార్కులు సాధించిన మరో పదిమంది విద్యార్థులను కూడా ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో కావేరి పర్యవేక్షకులు ఈ. రామ్‌కిషన్ రాజు, ఉపాధ్యాయులు కే. శ్రీనివాస్, ఏ. శ్రీనివాస్ రెడ్డి, బి. అశోక్ కుమార్, ఏ. స్రవంతి, ఎండి షహనా, ఎం. విజయకుమార్, బి. ఉమా, పి. లక్ష్మణ్, ఎం. నవీన్ కుమార్, బి. కవిత, స్వర్ణలత, వి. నాగరాజు, స్వర్ణకుమారి తదితరులు పాల్గొని విద్యార్థులను అభినందించారు.

# మాజీ ఎమ్మెల్యే హరిప్రియ నాయక్ కు జన్మదిన శుభాకాంక్షలు.

## -కల్పనా సునీల్ నాయక్.



**బయ్యారం/,ఏప్రిల్ 30.(జర్నలిస్ట్ వార్త)**
నేడు పుట్టినరోజు జరుపుకుంటున్న బిఆర్ఎస్ పార్టీ ఇల్లందు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ హరిసింగ్ నాయక్ కు బయ్యారం మండలం బిఆర్ఎస్ పార్టీ నాయకురాలు కల్పనా సునీల్ నాయక్ పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కల్పనా సునీల్ నాయక్ మాట్లాడుతూ నవతరం నాయకురాలు,ప్రజల మనసులు గెలుచుకున్న జన హృదయ నేత, జనం మెచ్చిన నేత జనం కోసం తపించే నేత ప్రజలు మెచ్చిన నాయకురాలు హరిప్రియ నాయక్ నాయకత్వంలో ఇల్లందు నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందాలని,మీకు ఆయురారోగ్యాలు కలగాలని ఆకాంక్షిస్తున్నానని అన్నారు.

# నా భూమిలో టిఎస్ఐఐసి నిర్మాణాలు నిలిపివేయాలి

## తహసీల్దార్ కు మహిళ రైతు వినతి



**భీమదేవరపల్లి/ఏప్రిల్29 (జర్నలిస్ట్ వార్త):** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలోని గట్లనర్సింగాపూర్ గ్రామానికి చెందిన చల్లూరు రాణి తన భూమిలో జరుగుతున్న నిర్మాణ పనులను వెంటనే నిలిపివేసి న్యాయం చేయాలని అధికారులను కోరారు. ఈ మేరకు బుధవారం భీమదేవరపల్లి తహసీల్దార్‌కు ఆమె దరఖాస్తు సమర్పించారు. రాణి తెలిపిన వివరాల ప్రకారం, గట్లనర్సింగాపూర్ శివారులోని సర్వే నంబర్ 90/1లో తనకు రెండున్నర ఎకరాల భూమి ఉందని, ఆ భూమిని సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నానని తెలిపారు. గతంలో తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (టీఎస్ఐఐసీ) సమీపంలోని వంగర శివారులోని భూములను ప్రభుత్వం సేకరించిందని, ఆ సమయంలో హద్దురాళ్లు కూడా పాతినట్లు చెప్పారు. అయితే తన భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటున్నట్లు గానీ, పరిహారం అందజేస్తున్నట్లు గానీ ఎటువంటి సమాచారం ఇవ్వలేదని ఆమె ఆరోపించారు. కానీ ఇటీవల తన భూమిలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌కు సంబంధించిన ట్యాంక్ నిర్మాణ పనులు ప్రారంభించారని పేర్కొన్నారు. తన భూమి ప్రభుత్వం తీసుకోలేదని, అయినప్పటికీ అనుమతి లేకుండా నిర్మాణాలు చేపట్టడం అన్యాయమని, పలుమార్లు సంబంధిత అధికారులకు తెలిపినా స్పందన లేదని వాపోయారు. వెంటనే నిర్మాణ పనులు నిలిపివేసి తనకు న్యాయం చేయాలని ఆమె వేడుకున్నారు. ఈ విషయమై టీఎస్ఐఐసీ ఇంజనీర్‌ను వివరణ కోరగా, రెవెన్యూ అధికారులు మార్కింగ్ చేసి అప్పగించిన భూమిలోనే ట్యాంకు నిర్మాణం ప్రారంభించినట్లు తెలిపారు. ఈ అంశంపై తహసీల్దార్ తనను సంప్రదించారని, మండల సర్వేయర్ మూడు రోజులుగా సెలవుల్లో ఉన్నారని చెప్పారు. సర్వేయర్ తిరిగి వచ్చిన వెంటనే మరోసారి సర్వే నిర్వహించి వాస్తవ పరిస్థితిని నిర్ధారిస్తామని తెలిపారు. అప్పటివరకు ట్యాంకు నిర్మాణ పనులు నిలిపివేసినట్లు వెల్లడించారు

# ధాన్యం కొనుగోలులో రైతులకు అండగా నిలవాలి: మంత్రి పొన్నం

## కాంగ్రెస్ కార్యకర్తలు గ్రామాల్లో చురుకుగా పనిచేయాలి



**భీమదేవరపల్లి/ఏప్రిల్29 (జర్నలిస్ట్ వార్త):** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముల్కనూర్‌లో బుధవారం మండల ముఖ్య కార్యకర్తల సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశానికి రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ ముఖ్య అతిథిగా హాజరై కార్యకర్తలకు పలు దిశానిర్దేశాలు చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఐలయ్య, ఇతర ముఖ్య నేతలు, అన్ని గ్రామాల కాంగ్రెస్ పార్టీ సర్పంచ్‌లు, గ్రామ అధ్యక్షులు, ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు. మంత్రి మాట్లాడుతూ గ్రామాల్లో ప్రస్తుతం ధాన్యం కొనుగోలు ప్రక్రియ కొనసాగుతోందని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోలు కేంద్రాల వద్ద ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని సూచించారు. రైతులకు సకాలంలో సహాయం అందేలా కాంగ్రెస్ నాయకులు చొరవ తీసుకోవాలని అన్నారు. వేసవి కాలంలో గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, గతంలోనే మండల, జిల్లా అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి తాగునీటి సరఫరాపై ప్రత్యేక సమీక్ష నిర్వహించినట్లు తెలిపారు.
జూన్‌లో ప్రారంభమయ్యే పాఠశాలల్లో ‘బడిబాట’ కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్ల సంఖ్య పెంచాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం పాఠశాలలకు అవసరమైన మౌలిక సదుపాయాలు, ఉపాధ్యాయులను అందిస్తోందని, పాఠశాలల సమస్యలను కూడా పరిష్కరిస్తోందని చెప్పారు. “మీ గ్రామాల్లో మీ బడిని మీరే కాపాడుకోవాలి” అని స్పష్టం చేశారు. వచ్చే వర్షాకాలంలో గ్రామాల్లో పెద్ద ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టాలని, ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్క నాటాలని సూచించారు. ప్రతి మండలానికి ఒక మెడికల్ కాలేజీని దత్తతగా ఇచ్చిన నేపథ్యంలో అన్ని గ్రామాల్లో మెడికల్ క్యాంపులు నిర్వహించి ప్రతి ఒక్కరికీ ఆరోగ్య పరీక్షలు చేయించాలని అన్నారు. ప్రతి గ్రామంలో ఒక్కో అంశానికి ఐదుగురు సభ్యులతో కమిటీలు ఏర్పాటు చేసుకోవాలని, సమావేశంలోనే గ్రామాల వారీగా వేరువేరుగా కూర్చొని కమిటీలను ఖరారు చేయాలని సూచించారు. ఓటర్ల నమోదు సవరణ దేశవ్యాప్తంగా జరుగుతోందని, దొంగ ఓట్లు నమోదు కాకుండా, ఓటు తొలగింపులు జరగకుండా ప్రతి వార్డులో బీఎల్ఏలను నియమించుకోవాలని తెలిపారు. వర్షాకాలంలో రోడ్లు, డ్రైన్లు, బ్రిడ్జిలు తదితర అవసరమైన అభివృద్ధి పనులకు ప్రతి గ్రామానికి నిధులు అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ మండలంలో తొలి విడతలో 450 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసినట్లు మంత్రి తెలిపారు. వాటి నిర్మాణ పనులు వేగంగా పూర్తయ్యేలా చూడాలని, ఇందుకు సంబంధించి అధికారులతో ప్రత్యేక సమీక్షా సమావేశం కూడా ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.

**ముల్కనూర్ బస్ స్టేషన్ అభివృద్ధికి మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాలు**
అంతకుముందు ముల్కనూర్ బస్ స్టేషన్‌ను రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పరిశీలించారు. బస్ స్టేషన్‌లో ప్రస్తుతం ఉన్న నాలుగు ప్లాట్‌ఫామ్‌లను ఆరుకు పెంచాలని అధికారులకు సూచించారు. ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించే దిశగా బస్ స్టేషన్ అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని మంత్రి ఆదేశించారు. బస్ స్టేషన్ బయట రోడ్డు వైపు కమర్షియల్ షాపింగ్ కాంప్లెక్స్ షట్టర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. అదేవిధంగా బస్ స్టేషన్‌కు పేయింటింగ్ చేయడం, బయట గార్డెన్ ఏర్పాటు చేయడం, లోపల మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం వంటి పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఈడీ వెంకన్న, ఆర్ఎం, డీఎం తదితర అధికారులు పాల్గొన్నారు.


# రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు పూర్తి చేయాలి

## తాగునీటి సరఫరాపై అధికారులు అప్రమత్తంగా ఉండాలి

## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల్లో వేగం పెంచాలి -జిల్లా, మండల స్థాయి అధికారులతో మంత్రి పొన్నం ప్రభాకర్







**భీమదేవరపల్లి/ఏప్రిల్29 (జర్నలిస్ట్ వార్త):** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలో ధాన్యం కొనుగోలు, వేసవి తాగునీటి సరఫరాపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. బుధవారం భీమదేవరపల్లి మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు, పురోగతిపై జిల్లా, మండల స్థాయి అధికారులతో మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ధాన్యం కొనుగోలు కేంద్రాల పనితీరును సమీక్షించిన మంత్రి, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. ధాన్యాన్ని దూర ప్రాంతాల మిల్లులకు కాకుండా ములుకనూరు, ఎల్కతుర్తి పరిధిలోని మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వేసవిలో గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, గ్రామాల్లో వైద్య ఆరోగ్య శిబిరాలు నిర్వహించాలని అధికారులకు సూచించారు. తెలంగాణ మోడల్ స్కూల్ వద్ద మురుగునీరు నిల్వ సమస్యను వెంటనే పరిష్కరించాలని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల్లో వేగం పెంచి, లబ్ధిదారులు త్వరగా గృహప్రవేశాలు చేసుకునేలా చూడాలని గృహ నిర్మాణ శాఖ అధికారులను ఆదేశించారు. మండలంలోని రోడ్ల నిర్మాణాలు పూర్తి చేయడం, ప్రభుత్వ కార్యాలయాలకు పెయింటింగ్ వేయించడం, సాగునీటి కాలువల పునరుద్ధరణ చేపట్టాలని సూచించారు. ఆయిల్ పామ్ సాగు విస్తరణకు ఉద్యాన శాఖ అధికారులు రైతుల్లో అవగాహన కల్పించాలని, ఉపాధి హామీ పనులకు సంబంధించిన బిల్లులు సకాలంలో చెల్లించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. చెరువుల నీటిని ఆధారంగా చేసుకుని పంటలకు సాగునీరు అందించేలా సమగ్ర ప్రణాళిక రూపొందించాలని సాగునీటి శాఖకు సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరిగేలా బడిబాట కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని, డ్రాపౌట్స్ లేకుండా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. పాఠశాలల్లో మౌలిక వసతుల కోసం విద్యా, ఇంజనీరింగ్ శాఖలు సమన్వయంతో ప్రణాళిక సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి, ఎల్కతుర్తి మార్కెట్ కమిటీ చైర్మన్ సంతాజీ, జడ్పీ సీఈవో శేషాద్రి, డీఆర్డీవో మేన శ్రీను, జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మీ రమాకాంత్, జిల్లా ఉద్యాన అధికారి అనసూయ, డీఈవో గిరిరాజ్ గౌడ్, ఆర్ అండ్ బీ ఈఈ సురేష్ బాబు, ఎంపీడీవో వీరేశం, తహసీల్దార్ రాజేష్, ఇతర అధికారులు, సర్పంచులు పాల్గొన్నారు.